సాక్షి
బాపట్ల

ఆదివారం । 20 । జూలై । 2025



ఒంటి కాలిపై నిలబడి నిరసన

రేపల్లె: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్క రించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శనివారం కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలియజేశారు.



మంత్రి వినతుల స్వీకరణ

తెనాలి అర్బన్: రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం బోసు రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.



వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ

నగరం: మండలంలోని ధూళిపూడిలో స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపట్ల

- అందరి సహకారంతో తీర్చిదిద్దుదాం
- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాన్ని వివరిస్తూ అవగాహన ర్యాలీని శనివారం పట్టణంలో నిర్వహించారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా చెత్త డంపింగ్ యార్డు వద్దకు చేరుకున్న విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై కలెక్టర్ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌తో కలిగే నష్టాన్ని వివరించారు. విద్యార్థులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా కలెక్టర్, బాపట్ల శాసనసభ్యుడు కలసి పారిశుద్ధ్య కార్మికులను పుష్పమాలతో సత్కరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా వినియోగాన్ని పూర్తిగా నిలిపి వేయాలని బాపట్ల శాసనసభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. బుడ చైర్మన్ సలగాల రాజశేఖర్ బాబు, జిల్లా రెవెన్యూ అధికారి, పురపాలక సంఘం ప్రత్యేక అధికారి జి.గంగాధర్ గౌడ్, డీపీఓ ప్రభాకర్ రావు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఆర్డీవో గ్లోరియా, సీపీఓ షాలేమ్ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులుపాల్గొన్నారు.

పీ 4 విధానంతో పేదలకు మేలు

నిరుపేద కుటుంబాలను పీ4 విధానం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. నందిరాజు తోట గ్రామసభకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నందిరాజు తోట, హైదరపేట గ్రామాలలో 106 మందిని బంగారు కుటుంబాలుగా ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, సీపీఓ షాలేమ్ రాజు, బీసీ సంక్షేమ అధికారి శివలీల, బాపట్ల ఆర్‌డీఓ పి.గ్లోరియా, ఎంపీడీవో బాబురావు తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆకు వరకు కొంటాం

పర్చూరు(చినగంజాం): నల్ల బర్లీ పొగాకును చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడొద్దని కలెక్టర్ జె. వెంకట మురళి సూచించారు. పర్చూరులో పొగాకు కొనుగోలు కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. పొగాకు కొనుగోలుకు సంబంధించి రైతులతో ఆయన మాట్లాడారు. కొనుగోలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. పొగాకు కంపెనీలు రైతుల వద్ద పొగాకును కొనుగోలు చేయకుండా మోసం చేయడంతో ప్రభుత్వం ముందుకు వచ్చి కొనుగోలు చేస్తోందన్నారు. ఇప్పటి వరకు రూ. 25 కోట్ల విలువైన పొగాకును కొనుగోలు చేసినట్లు తెలిపారు. వర్షాలకు పొగాకు తడవకుండా కాపాడుకోవాలని సూచించారు. సోమవారం నుంచి ప్రతి రోజూ 900 టన్నుల పొగాకును కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. పొగాకు బేళ్ల 30 కంటే తేమశాతం తక్కువ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, తహసీల్దార్ పి. బ్రహ్మయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు, మార్క్‌ఫెడ్ అధికారులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శులు(పార్లమెంట్)గా జిల్లాకు చెందిన బసవ పున్నారెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి, కర్నేటి వెంకటప్రసాద్‌లను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, జిల్లా పరిశీలకులకు వీరు సహాయకులుగా పనిచేయనున్నారు.

తొలి నుంచి పార్టీకి అండగా..



బసవ పున్నారెడ్డి

- మోదుగుల బసవపున్నారెడ్డి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. పిట్టలవానిపాలెం మండల పరిషత్ అధ్యక్షుడిగా పనిచేశారు. పార్టీ రేపల్లె, వేమూరు, ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గాల పరిశీలకుడిగా వ్యవహరించారు. బసవ పున్నారెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంతో ఆయన వర్గీయులు హర్షం వ్యక్తం చేశారు.



నారాయణరెడ్డి

- జిల్లాకు చెందిన చేజర్ల నారాయణరెడ్డి వైఎస్సార్‌సీపీలో క్రియాశీలక నేతగా ఉన్నారు. రెండు మార్లు చేనేత, జౌళి శాఖ సలహామండలి సభ్యుడిగా పనిచేశారు. వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల బాసట సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు.



వెంకటప్రసాద్

- చీరాలకు చెందిన కర్నేటి వెంకట ప్రసాద్ విద్యార్థి దశ నుంచి క్రియాశీల రాజకీయాల్లో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా పనిచేశారు. బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. తమకు పార్టీ పదవులు ఇచ్చిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా పరిశీలకులు వైవీ సుబ్బారెడ్డి, బాపట్ల పార్లమెంట్ పరిశీలకులు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, చీరాల సమన్వయకర్త కరణం వెంకటేశ్‌లకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి తమ వంతుగా నాయకులు, కార్యకర్తలను కలుపుకొని కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

న్యూస్‌రీల్

భగవతి పద్మావతి అమ్మవారికి సారె



తెనాలి టౌన్: రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ పరంజ్యోతి భగవతి పద్మావతి అమ్మవారికి శనివారం ఆషాఢ మాస సారె సమర్పించారు. అమ్మవారిని శ్రీ శాకంబరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తెనాలి, పరిసర ప్రాంతాల నుండి భక్తులు విశేష సంఖ్యలో తరలి వచ్చి సారె సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారిని దర్శించుకుని భక్తులు తన్మయం చెందారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారు ప్రత్యేక దర్శనం



బాపట్ల అర్బన్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని నందిరాజుతోటలోని గంగా పార్వతీ సమేత ఓంకార బ్రహ్మలింగేశ్వరస్వామి దేవాలయంలో శనివారం పార్వతి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పలు కాయగూరలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అంగరంగ వైభవంగా కుంకుమ పూజ నిర్వహించారు. యాభై మంది భక్తులు పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు పొందారు.

565 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం శనివారం 565 అడుగులకు చేరింది. ఇది 244.1480 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 67,800 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

మోపిదేవి ఆలయంలో ఆర్వో ప్లాంట్లు ప్రారంభం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో దివీస్ లెబోరేటరీస్ లిమిటెడ్ రూ.32 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు ఆర్వో ప్లాంట్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం ప్రారంభించారు. దివీస్ ల్యాబ్ ప్రతినిధులు నగేష్, శ్రీనివాస్‌ను ఆలయ ఈఓ శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో వేద పండితులు ఘనంగా సత్కరించారు. ఆశీర్వచనాలు అందజేసి స్వామి చిత్రపటం బహూకరించారు.

దుర్గమ్మ సేవలో ప్రముఖులు



ఇంద్రకీలాద్రి: విజయవాడ దుర్గమ్మను విశ్రాంత ఐపీఎస్ అధికారి రమణకుమార్, ఐఏఎస్ అధికారి ఉదయలక్ష్మి శనివారం దర్శించుకున్నారు. అమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



మోపిదేవి: మోపిదేవిలో వేంచేసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు ముగిశాయి. శనివారం ఉదయం పూర్ణాహుతి నిర్వహించారు.

క్షణికావేశంతో జీవితాలు నాశనం

సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల



సబ్ జైలును పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల

రేపల్లె: క్షణికావేశంలో చేసిన తప్పిదాలకు జీవితాన్ని కోల్పోవాల్సిన పరిస్థితులు నెలకొంటాయని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల చెప్పారు. పట్టణంలోని సబ్‌జైలును శనివారం ఆమె పరిశీలించారు. జైలులో ఖైదీలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఖైదీలు సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంబించటంతో మంచి జీవితం లభిస్తుందన్నారు. కోర్టులో తమ కేసులను వాదించేందుకు ప్రైవేటు న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని ఖైదీలు ప్రభుత్వం నియమించిన న్యాయవాది ద్వారా తమ కేసును కోర్టులో వాదించుకోవచ్చన్నారు. ఖైదీలకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. జైలులో ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని, వసతులను, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గీతా భార్గవి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న సాగు నీటి విడుదల



వెల్లటూరు చానల్ వద్ద పొంగుతున్న సాగు నీరు

వెల్లటూరు(భట్టిప్రోలు): కృష్ణానది ఎగువ నుంచి దిగువన బ్యాంక్ చానల్‌కు సాగు నీరు విడుదల పెంచుతున్నారు. వెల్లటూరు కాల్వ వద్ద నీరు పొంగి ప్రవహిస్తోంది. కాల్వ కట్టలు పొంగి పొర్లాయి. 5 తూములు కాల్వలు, వెల్లటూరు ఇరువైపులా ఉన్న వంతెన కింద ప్రవాహం తాకింది. సాగు నీటి పారుదల శాఖ కార్యాలయం, లోకల్ ఫండ్ సత్రం ప్రధాన రహదారిలో నీరు చేరుతోంది. సాగునీరు పశ్చిమ బ్యాంక్ కెనాల్ వద్దకు సమీపంలోని ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎగువ చానల్ నుంచి నీరు విడుదల నిలుపుదల చేయడానికి చర్యలు చేపట్టినట్లు నీటి పారుదల శాఖాధికారులు తెలిపారు.

దోపిడీ ఆపి రైతులను ఆదుకోండి



డ్రైనేజీ కాలువలో దిగి నిరసన వ్యక్తం చేస్తున్న వరికూటి అశోక్‌బాబు

- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- గుర్రపు డెక్కతో నిండిన డ్రైన్‌లోకి దిగి నేతలతో కలసి నిరసన

కొల్లూరు: వ్యవసాయ రంగంపై కూటమి ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థలే నిదర్శనమని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని అద్దేపల్లి వద్ద గుర్రపు డెక్కతో నిండిపోయి సుమారు 3 వేల ఎకరాల పంట భూములను ముంపునకు గురి చేస్తున్న భట్టిప్రోలు, అద్దేపల్లి, కనగాల గ్రామాల నడుమ ఉన్న డ్రైనేజీ కాలువను ఆయన స్థానిక రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువలోకి దిగి సమస్యను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థలను బాగు చేయకుండానే బాగు చేసినట్లు చెబుతూ నిధులు దోచుకుంటున్న అధికార కూటమి నాయకుల తీరుపై ఆయన మండిపడ్డారు. కాలువల్లో పూడికతో నీరు ముందుకు పోకుండా పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. వారం రోజుల వ్యవధిలో కాలువలు బాగు చేసి రైతు సమస్యలను పరిష్కరించని పక్షంలో అదే మురుగు కాలువలో ధర్నా చేస్తానని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పి. శ్రీనివాసరావు, నాయకులు సిరాజుద్దీన్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులపై అదే చిన్నచూపు

- మళ్లీ నిరూపించుకున్న కూటమి సర్కార్
- జిల్లాలో 390 కియోస్క్‌లకు తాళాలు
- అనుకూల వర్గీయులకే ఫోన్ ద్వారా సేవలు అందిస్తున్న సిబ్బంది



మూత పడ్డ కియోస్క్ యంత్రాలు

రేపల్లె: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన రైతు సంక్షేమ పథకాలను కూటమి సర్కార్ హయాంలో ఒక్కొక్కటిగా నిలిపేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ సేవలకు కేంద్ర బిందువులుగా నిలిచిన రైతు భరోసా కేంద్రాలు ఇప్పుడు కేవలం పేరుకే 'రైతు సేవా కేంద్రాలు'గా మిగిలిపోయాయి. కియోస్క్‌లను మూసివేయడం వల్ల పంటల నమోదు, పాస్‌బుక్ ప్రింటింగ్, రైతుబంధు/రుణ మాఫీ వివరాలు, పెట్టుబడి సాయానికి సంబంధించిన సమాచారాన్ని సకాలంలో పొందలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మూలకు చేరిన 390 యంత్రాలు

బాపట్ల జిల్లాలో మొత్తంగా 390 కియోస్క్ యంత్రాలు పనిచేయడం లేదు. రైతులు ఆన్‌లైన్ సేవల కోసం మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. రైతులకు నేరుగా సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు, ఇప్పుడు 'రైతు సేవా కేంద్రాల'గా మారిపోయాయి. ఈ మార్పుతోపాటు రైతులకు సాంకేతిక సేవలు అందించే కియోస్క్ యంత్రాలు పెద్దఎత్తున మూలకు చేరాయి. దీనివల్ల రైతులు దరఖాస్తులు, పంటల నమోదు, ఆన్‌లైన్ సర్టిఫికెట్లు వంటి సేవల కోసం మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నాయకులదే హవా..

గతంలో కియోస్క్ యంత్రాల ద్వారా అందించిన సేవలు ప్రస్తుతం ఫోన్‌ల ద్వారా అందజేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రేపల్లె వ్యవసాయ సబ్ డివిజన్‌లో సేవల కోసం సేవా కేంద్రాలకు వెళ్లిన రైతులకు గ్రామ నాయకుడితో ఫోన్ చేయిస్తే ఆర్డర్ బుక్ చేస్తామంటూ బహిరంగంగానే అంటున్నట్లు చెబుతున్నారు.

ఫోను ద్వారా సేవలు



రేపల్లె వ్యవసాయ సబ్ డివిజన్‌లోని రైతు సేవా కేంద్రాలలో రైతులకు అవసరమైన సేవలను అందిస్తున్నాం. గతంలో కియోస్క్ యంత్రాల ద్వారా అందిన సేవలు ప్రస్తుతం గ్రామ సహాయకుల చేత ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్నాయి. ఇలా సేవలు పొందటం వల్ల కియోస్క్ యంత్రాలతో పనిలేకుండా పోతోంది.

– అదేపల్లి లక్ష్మి, ఏడీఏ, రేపల్లె

ఇంజినీరింగ్ విద్య ఒక్కటే గమ్యం కాదు

జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ చేకూరి శివరామకృష్ణప్రసాద్



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

తెనాలి: విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య ఒక్కటే గమ్యం కాదనీ.. అది లేకపోతే జీవితం వ్యర్థం అనే భావనలను ముందుగా తల్లిదండ్రులు విడనాడాలని కాకినాడ జేఎన్‌టీయూకే వైస్ చాన్స్‌లర్ డాక్టర్ చేకూరి శివరామకృష్ణప్రసాద్ అన్నారు. పట్టణానికి చెందిన మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన సభకు సంస్థ వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. మొవ్వా విజయలక్ష్మి స్మారక నాలుగో అవార్డును తెనాలికి చెందిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు బహూకరించారు. ఇదే సభలో గత మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో 550, ఆపైన మార్కులు సాధించిన 60 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.5 వేల చొప్పున రూ.3 లక్షల నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలను అందజేశారు. ముఖ్యఅతిథి డాక్టర్ శివరామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కోర్సులు పూర్తిచేసుకుని బయటకు వచ్చేవారిలో 15 శాతం మాత్రమే ఉద్యోగాలకు అర్హులని నివేదికలు చెబుతుంటే లోపం ఎవరిదని ప్రశ్నించారు. ఇంజినీరింగ్‌లో 1.90 లక్షల కన్వీనర్ సీట్లుంటే 1.40 లక్షలు కూడా భర్తీకావటం లేదన్నారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడారు.

విద్యార్థుల చేతుల్లోనే బంగారు భవిష్యత్తు

డాక్టర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సరైన రీతిలో వాడుకుంటే సెల్‌ఫోన్ బ్రహ్మాస్త్రమని సోదాహరణంగా చెప్పారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి తన ప్రసంగంలో బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని విద్యార్థుల నుద్దేశించి అన్నారు. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, మాతృభాషలో సౌమ్యంగా మాట్లాడటం, చుట్టూ ఉన్న అందరితో సత్సంబంధాలు కొనసాగించటం, చేసే ప్రతిపనికి ఎవరికివారు బాధ్యత వహించటం అలవాటు చేసుకుంటే ఏ టెక్నాలజీ వచ్చినా ఇబ్బంది ఉండదన్నారు. డ్రగ్స్, ఆల్కహాల్, ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఫ్లయ్ ఓవర్ పనుల పరిశీలన



గుంటూరు వెస్ట్: నగరంలోని శంకర్ విలాస్, నందివెలుగు రోడ్డులోని ఫ్లైఓవర్‌ల నిర్మాణ స్థితిగతులను శనివారం కేంద్ర పట్టణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ హయాంలో రూ.98 కోట్ల ఎస్టిమేషన్‌తో శంకర్‌విలాస్ బ్రిడ్జ్‌ను అత్యాధునికంగా నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. మణిపురం వంతెన పనులను మళ్లీ ప్రారంభించామన్నారు. ప్రజలకు రానున్న కాలంలో మెరుగైన రవాణా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

దొంగలు హల్‌చల్

- తాళం వేసిన ఇళ్లల్లో వరుస చోరీలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- నాలుగు రోజుల్లో 4 నివాసాల్లో లూటీ



ఇటీవల చోరీకి వచ్చి ఇంటి తాళం పగులగొడుతున్న దుండగులు (సీసీ ఫుటేజీ)

చీరాల టౌన్: వరుస దొంగతనాలతో ఈపురుపాలెం ప్రాంత ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడు ఎవరింట్లో పడి ఉన్నదంతా దోచేస్తారో తెలియక టెన్షన్ పడుతున్నారు. ఈపురుపాలెం మేజర్ గ్రామ పంచాయతీలో గత నాలుగు రోజుల్లోనే నాలుగు ఇళ్లల్లో దొంగలు పడి అందినకాడికి బంగారం, పట్టు చీరలు, టీవీలు, వెండి వస్తువులు, నగదు దోచుకువెళ్లారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము మధ్య ఈ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

దొంగతనాలు ఇలా..

శనివారం వేకువజామున పద్మనాభునిపేటలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లల్లో దొంగలు పడి అందినకాడికి దోచుకెళ్లారు. ముస్లింలు ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లడంతో నలుపు రంగు కారులో వచ్చిన ముగ్గురు దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని బంగారం 6 సవర్లు, ఖరీదైన పట్టు చీరలు, వెండి వస్తువులు, పెద్ద ఎల్ఈడీ టీవీని అపహరించుకెళ్లారు. ఈ ఇంటిలోనే మూడు నెలల క్రితం దొంగలు పడి బంగారం, ఖరీదైన వస్తువులు దోచుకెళ్లారు. ఈ రెండు ఘటనలపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. అలానే పురుగుల పేటకు చెందిన చేనేత సామాజిక వర్గానికి చెందిన భార్యా భర్తలు ఇరువురు ఇంటికి తాళం వేసి చిలకలూరిపేటలోని బంధువుల ఇంటికి వెళ్లి శనివారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో మగ్గంపై నేసి ఉంచిన మూడు చీరలు, వెండి వస్తువులు, రూ.7 వేల నగదు, స్మార్ట్ వాచ్, ఇతర వస్తువులను అపహరించుకెళ్లారు. అలానే నలభై ఇళ్ల కాలనీలో ఓ కుటుంబం ఇంటికి తాళం వేసి వేరే ఊరు వెళ్లడంతో దొంగలు పడి బంగారం, డబ్బులు, విలువైన వస్తువులు దోచుకెళ్లారు.

పట్టపగలు చైన్ స్నాచింగ్

మేదరమెట్ల: మహిళ మెడలోని బంగారు చైన్‌ను లాక్కొని పారిపోయిన సంఘటన కొరిశపాడులో చోటు చేసుకుంది. బాధితురాలు గోలి సత్యవతి తెలిపిన సమాచారం మేరకు.. కొరిశపాడులోని ఇంటి వద్ద బాధితురాలు టిఫిన్ హోటల్ నడుపుకుంటూ ఉంది. శనివారం ఉదయం బైక్‌పై ఇద్దరు వచ్చి ఆమెను మాటల్లో పెట్టారు. ఆమె మెడలో ఉన్న 28గ్రాముల బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై చిలకలూరిపేట వైపు పారిపోయారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.

క్లుప్తంగా

ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



చీరాల రూరల్: బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీరాలలోని ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో సీనియర్ మెన్ ఫుట్‌బాల్ సెలక్షన్లను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వి. విజయకుమార్ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించారు. 50 మంది క్రీడాకారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. వారిలో అత్యంత ప్రతిభ కనబరచిన 22 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు నాలుగు జిల్లాల ప్రాంతీయ కో–ఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు, సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జి బొనిగల ప్రేమయ్య తెలిపారు. త్వరలో జరగబోయే నాలుగు జిల్లాల స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అక్కడ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపికచేస్తామని అందులో కూడా సత్తాచాటిన క్రీడాకారులను దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన సంతోష్ ట్రోఫీ జట్టుకు ఎంపికచేస్తామని తెలిపారు. అంపైర్లుగా ప్రసన్నకుమార్, నరేష్ వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఇసుక దర్శి ఫ్లైఓవర్ పై జరిగింది. హైవే మొబైల్ సిబ్బంది రవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ నుంచి నెల్లూరు జిల్లా కలిగిరికి ఉల్లిపాయల లోడుతో వెళుతున్న టాటా ఏస్ వాహనాన్ని అదే మార్గంలో జార్ఖండ్ నుంచి నెల్లూరు వెళుతున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో టాటా ఏస్ ఆటో డ్రైవర్ చిలక మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఉల్లిపాయలు రహదారికి అడ్డంగా పడిపోయాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది గాయపడిన డ్రైవర్ మహేష్‌ను మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ప్రభుత్వ తీరుపై పసుపు రైతుల ఆగ్రహం

- కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాద బాధితులకు క్వింటాకు రూ.7 వేలు ఇవ్వాలి
- బీమా పరిహారంతో సరిపెడితే ఎలాగని అన్నదాతల మండిపాటు
- మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం నగదు కూడా చెల్లించాలని వినతి



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న రైతులు

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో గతేడాది జనవరిలో దగ్ధమైన పసుపు రైతులకు వచ్చిన మొదటి విడత బీమా పరిహారం సరిపోదని, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం క్వింటాకు రూ.7 వేలు చొప్పున ఇవ్వాల్సిందేనని బాధిత పసుపు రైతులు డిమాండ్ చేశారు. తొలి విడత బీమా పరిహారం వచ్చిన నేపథ్యంలో సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహను శనివారం బాధిత రైతులు కలిశారు. గుంటూరులో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ బీమా పరిహారం చెక్కును అందజేస్తారని సబ్‌కలెక్టర్ వారికి చెప్పారు. రైతులు మాత్రం తమకు బీమాతోపాటు క్వింటాకు రూ.7 వేల చొప్పున సాయం కూడా ఒకేసారి వచ్చేలా చూడాలని కోరారు. మార్కెటింగ్ శాఖ అధికారి, దుగ్గిరాల పసుపు యార్డు కార్యదర్శి కూడా అక్కడకు వచ్చారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్‌తో మాట్లాడి తమ సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరారు. ఫోనులో ప్రయత్నించినా అందుబాటులోకి రావటం లేదని చెప్పి మార్కెటింగ్ అధికారులు వెళుతుండగా, రైతులు ఆందోళన చేశారు. బీమా పరిహారం వరకు తీసుకుంటే అప్పులవాళ్లు తమ వెంటబడతారని, అరకొర డబ్బులతో అందరికీ సర్దుబాటు చేయటం సాధ్యం కాదన్నారు. ఇబ్బందులు పడతామని తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు న్యాయం చేయాలని, మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం డబ్బులు ఇవ్వాలని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. తమలో తాము చర్చించుకున్న అనంతరం రైతులు గుంటూరు వెళ్లి మంత్రి పెమ్మసానితో మాట్లాడి తేల్చుకుందామని బయలుదేరారు.

పొగాకు కొనుగోలుపై స్పెషల్ కలెక్టర్ ఆరా

తక్కువ ధరకు కొంటున్నారని రైతుల ఆవేదన



పొగాకు కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ కలెక్టర్ రమేష్‌బాబు

నాదెండ్ల: గణపవరం రెవెన్యూ పరిధిలోని నూతన వ్యవసాయ మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని శనివారం పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ రమేష్‌బాబు పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు అధికారులు కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యతను బట్టి క్వింటా రూ.12 వేలు, రూ.9 వేలు, రూ.6 వేలకు కొనుగోలు చేయాల్సి ఉండగా, మొక్కుబడిగా కొంత పొగాకుకు మాత్రమే అధిక ధరకు కొంటున్నారని తెలిపారు. మిగిలిన పొగాకును తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోయారు. అనేక సాకులు చెబుతూ పొగాకును తిరస్కరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేదంటూ వాపోయారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఎస్. చంద్రశేఖర్, వీఆర్వోలు ఉన్నారు.

బీఎం డ్రెయిన్‌పై అక్విడెక్ట్ పనులు వేగవంతం

ఇరిగేషన్ సీఈ రాంబాబు



బీఎం డ్రెయిన్‌పై అక్విడెక్ట్ ప్రాజెక్ట్ పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ సీఈ

భట్టిప్రోలు: ఖరీఫ్ సీజన్ పురస్కరించుకుని భట్టిప్రోలు, గ్రామాల మధ్య బీఎం డ్రెయిన్‌పై నిర్మించిన అక్విడెక్ట్ పనులు వేగవంతం చేయాలని నీటి పారుదల శాఖ ఇరిగేషన్ సీఈ బి.రాంబాబు పేర్కొన్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన అక్విడెక్ట్ గత ఏడాది అక్టోబర్‌లో కూలిపోయిన ఘటన అందరికి తెలిసిందే. శనివారం అక్విడెక్ట్ పనులు పరిశీలించారు. సీఈ రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.10.60 కోట్ల నిధులతో నిర్మాణం జరిగిందని చెప్పారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ఈ చానల్ కింద రైతులకు సాగునీరు అందుతుందనే భవన కల్గించినట్లు తెలిపారు. భట్టిప్రోలు, చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల పరిధిలో 35 వేల ఎకరాలకు ఈ చానల్ ద్వారా సాగునీరు సరఫరా అవుతుందని వివరించారు. అక్విడెక్ట్ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీటి సకాలంలో విడుదల చేయాలనే దృక్పథంతో పనులు వేగవంతం చేసినట్లు తెలిపారు. సీఈ వెంట ఎస్ఈ పి.వెంకటరత్నం, ఈఈ సుధాకర్, డీఈఈ అనీల్ కుమార్, ఏఈ ఎస్.సువర్చల, ఐసీ అసిస్టెంట్ వి.వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ పి.పుల్లారెడ్డి

బాపట్లటౌన్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేయాలని సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు. పట్టణంలోని బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యుత్‌శాఖ జిల్లాస్థాయి అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు పూర్తిస్థాయిలో స్మార్ట్ మీటర్లపై అవగాహన కల్పించాలని సూచించారు. లో ఓల్టేజ్ సమస్యలు లేకుండా, నిరంతరం అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. పీఎం సూర్యఘార్ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్ తగ్గించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ ఎ.మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ఫైనాన్సు ఎస్.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ప్రాజెక్ట్ మూర్తి, ఎస్ఈ జి.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇంట్లోనే వ్యక్తి మృతి



కోన శ్రీనివాసరావు (ఫైల్)

కొల్లూరు: ఒంటరిగా నివసిస్తున్న ఓ వ్యక్తి తాను నివాసం ఉంటున్న పూరింటిలో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కొల్లూరుకు చెందిన కోన శ్రీనివాసరావు(52) స్థానికంగా బండిపై సోడాలు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చింతలమ్మ దేవస్థానం సమీపంలో నివాసం ఉంటున్న అతడు గత కొద్ది రోజులుగా ఇంటి నుంచి బయటకు రావడం లేదు. మంగళవారం సోదరుడు కుమారుడు అతని ఇంటి వద్దకు వెళ్లి పిలిస్తే సమాధానం లేకపోవడంతో నిద్రిస్తూ ఉండి ఉండవచ్చునని భావించి వెనుతిరిగాడు. అప్పట్నుంచి అతను ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో అనారోగ్యం కారణంగా ఇంటికే పరిమితమై ఉండి ఉండవచ్చునని చుట్టుపక్కల వారు భావించారు. అయితే శనివారం ఆ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో అనుమానం వచ్చిన స్థానికులు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల ఫిర్యాదుతో అక్కడకు చేరుకున్న కొల్లూరు పోలీసులు, వీఆర్ఓ సమక్షంలో తలుపులు పగులకొట్టి లోపలకు వెళ్లి చూడటంతో మంచంపై మరణించి ఉన్నాడు. మృతదేహం ఉన్న తీరును బట్టి అతను మద్యం తాగి, ఫిట్స్ వచ్చి మృతి చెంది ఉండవచ్చునని అనుమానిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. మృతదేహం నుంచి దుర్వాసన వస్తుండటంతో నాలుగు రోజుల క్రితం మృతి చెందిఉంటడని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పోస్టుమన్ మృతి

దైవదర్శనానికి భార్యను రైలెక్కించిన అనంతరం దుర్ఘటన

కారంచేడు: భార్యను, అత్తను తిరుమల దైవదర్శనం నిమిత్తం చీరాలలో రైలు ఎక్కించి తిరిగి స్వగ్రామానికి వెళుతున్న పోస్టుమన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున చీరాల–స్వర్ణ రోడ్డులో చోటు చేసుకుంది. కారంచేడు ఎస్సై షేక్ ఖాదర్ బాషా తెలిపిన వివరాల మేరకు... పాటిబండ్ల కృష్ణ (35) కారంచేడు మండలం తిమిడెదపాడు గ్రామంలో పోస్టుమన్‌గా చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 10.30 గంటలకు భార్య, అత్తను తిరుపతి వెళ్లేందుకు చీరాలలో రైలు ఎక్కించాడు. తిరిగి స్వర్ణ గ్రామం మీదుగా వెళుతుండగా టపాసుల గోడౌనుకు ఒక కిలోమీటరు దూరంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం కారంచేడు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి మృతి చెందాడా, ఏదైనా వాహనం ఢీకొని మృతి చెందాడా అనేది దర్యాప్తులో తేలనుంది. మృతుడికి ఒక పాప ఉంది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

రోగులకు మెరుగైన సేవలందించండి

సెకండరీ హెల్త్ విభాగం రాష్ట్ర జాయింట్ కమిషనర్ డాక్టర్ ఎస్.రమేష్‌నాథ్



రోగులతో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేష్‌నాథ్

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో పారిశుధ్య నిర్వహణను కొంత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని, ప్రతి రోజు వైద్యులు, సిబ్బంది ఈ విషయమై దృష్టి సారించాలని సెకండరీ హెల్త్ విభాగం రాష్ట్ర జాయింట్ కమిషనర్ డాక్టర్ ఎస్.రమేష్‌నాథ్ ఆదేశించారు. తెనాలి జిల్లా వైద్యశాల, తల్లిపిల్లల వైద్యశాలలను శనివారం ఆయన పరిశీలించారు. వైద్యశాలలోని ఓపీని పరిశీలించి రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ల్యాబ్‌లను, వార్డులను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సీటీ స్కాన్ యూనిట్ నిరుపయోగంగా ఉండటాన్ని గమనించిన ఆయన నూతన మిషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అలాగే ఈఎన్‌టీ ఆపరేషన్‌లకు సంబంధించిన మైక్రోస్కోప్ యంత్రాన్ని మంజూరు చేయించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. నవంబర్‌లో వైద్యుల పదోన్నతులు ఉన్నాయని అవి పూర్తి అవగానే తెనాలిలో ఖాళీగా ఉన్న ఫోరెన్సిక్, సైక్రియాటిక్ వైద్యుల పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉందని చెప్పారు. జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ బీవీ రంగారావు, వైద్యశాల ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రామాంజనరావు, సీనియర్ వైద్యులు డాక్టర్ జె.హనుమంతరావు, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ సురేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.600 కోట్లు ఎక్కడ?

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్ జీ

లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తుందని ఈనెల 12వ తేదీన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారని, వారం రోజులు గడుస్తున్నా ఇంత వరకు విడుదల కాలేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ అన్నారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలోని మల్లయ్య లింగం భవన్‌లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) నాయకులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం వలన దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు తమ డిగ్రీలు, పీజీలు పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, అజయ్ శివ గోపి పాల్గొన్నారు.

ఎల్ఐసీ జోనల్ క్యారమ్స్ టోర్నీ న్యాయ నిర్ణేతగా జలీల్



అబ్దుల్ జలీల్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరుకు చెందిన ప్రముఖ క్యారమ్స్ క్రీడాకారుడు ఏపీ క్యారమ్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్‌ను ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ క్యారమ్స్ సెలక్షన్స్ ట్రయల్స్ 2025–26కు గాను ముఖ్య న్యాయ నిర్ణేతగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతోపాటు ఆయన జోనల్ క్యారమ్స్ సెలక్షన్స్ కమిటీ సభ్యునిగానూ ఎంపికయ్యారు. రాష్ట్రంలో జలీల్‌కు మాత్రమే ఇటువంటి అవకాశం దక్కింది. జలీల్ ఇప్పటికే అంతర్జాతీయ రిఫరీగానూ, జాతీయ క్యారమ్స్ ప్యానెల్ కోచ్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా జలీల్‌కు ఆల్ ఇండియా క్యారమ్స్ సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ నీరజ్ కుమార్ సంపతి, ఏపీ క్యారమ్స్ సంఘం చీఫ్ ప్యాట్రన్ యాగంటి దుర్గారావు, జిల్లా అధ్యక్షుడు ఎంకేవీ ప్రసాద్, సెలక్షన్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాసరావులు అభినందనలు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌పై పోలీసులకు ఫిర్యాదు

వినుకొండ: పట్టణ మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌పై చిరు వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులో పద్మప్రియ లాడ్జి ఎదురుగా నిర్మాణ దశలో నిలిచిపోయిన షాపింగ్ కాంప్లెక్స్ వద్ద చిరు వ్యాపారులు షాపులు నిర్మాణం కోసం రేకుల షెడ్లు వేసుకున్నారు. శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ సిబ్బందితో కలిసి వాటిని తొలగించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు నిర్మాణం చేసుకుంటున్నామని చిరు వ్యాపారులు చెపుతున్నా వినకుండా దౌర్జన్యంగా తొలగించారని బాధితులు ఆరోపించారు. 30 ఏళ్లగా తామంతా చిన్నచిన్న షాపులు పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని, అన్యాయంగా ఖాళీ చేస్తుండటంతో కమిషనరుపై స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కమిషనర్ సుభాష్ చంద్రబోస్ దౌర్జన్యాన్ని సీపీఎం నేతలతో పాటు టీడీపీ కౌన్సిలర్ పత్తి పూర్ణ ఖండించారు.

సీఏలకు పుష్కల అవకాశాలు

ఐసీఏఐ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్



గుంటూరు ఎడ్యుకేషన్: చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏ)లకు దేశవ్యాప్తంగా డిమాండ్ నెలకొని ఉందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఉపాధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్ అన్నారు. ఐసీఏఐ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సీఏ విద్యార్థుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ప్రసన్నకుమార్ మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఏ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఐసీఏఐ కృషి చేస్తోందన్నారు. గుంటూరులో సీఏ విద్యార్థుల కోసం ఐసీఏఐ భవన్‌ను ఆధునిక వసతులతో నిర్మిస్తున్నామని తెలిపారు. సీఏ కోర్సుల విద్యార్థులకు ఐసీఏఐ స్టైఫండ్ ఇస్తోందన్నారు. సమావేశంలో ఐసీఏఐ వైస్ ప్రెసిడెంట్ డి.ప్రసన్నకుమార్, సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు, కార్యదర్శి ఎన్.రాజశేఖర్, గుంటూరు బ్రాంచి చైర్మన్ చింతా రఘునందన్, వైస్ చైర్మన్ బి.ఝాన్సీ లక్ష్మి, కార్యదర్శి వనిమిరెడ్డి వి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో 98.6 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 98.6 మిల్లీ మీటర్ల వర్షపాతం పడగా, అత్యల్పంగా మంగళగిరి మండలంలో 0.8 మి.మీ. పడింది. సగటు 15.3గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలంలో 61.2, పెదకాకాని 24.2, గుంటూరు పశ్చిమ 20.2, దుగ్గిరాల 16.4, ఫిరంగిపురం 14.4, పెదనందిపాడు 7.6, తెనాలి 7.4, తాడేపల్లి 6.2, మేడికొండూరు 5.2, తుళ్ళూరు 4.8, తాడికొండ 4.2, గుంటూరు తూర్పులో 4 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది.